ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0, కనిష్ఠం 25.5
ఆదిలాబాద్ జిల్లా వార్తలు
5
శనివారం 24 ఆగస్టు 2024





● జిల్లాకేంద్రంలోని పంజాబ్‌చౌక్ సమీపంలో వాహనానికి టైర్‌లాక్ వేసిన పోలీసులు



ట్రాఫిక్ రూల్స్.. తప్పనిసరి

- జిల్లాలో రోడ్లపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలిపితే ఇక అంతేసంగతి
- ట్రాఫిక్ నియంత్రణకు 'వెహికిల్ టైర్ లాక్' విధానం అమలు
- ఈ-చలాన్ ద్వారా వాహనదారులపై రూ.వెయ్యి వరకు జరిమానా
- నో పార్కింగ్ ఏరియాలు, రోడ్లపై వాహనాలను నిలిపితే చర్యలు తప్పవని హెచ్చరికలు
- జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేకదృష్టిని సారించిన పోలీసులు

ఆదిలాబాద్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనల పై అవగాహన కలిగి ఉండడం ఇకపై తప్పనిసరి. ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు ప్రత్యేకంగా 'వెహికిల్ టైర్ లాక్' విధానాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నిలిపి ఉంచిన పలు వాహనాలకు టైర్‌లాక్ విధానంతో జరిమానాలు విధించారు. రోడ్ల పై అడ్డదిడ్డంగా వాహనాలను నిలిపి ఉంచితే ఇక అంతే సంగతి అంటున్నారు. గతంలో మాదిరిగా కాకుండా నో పార్కింగ్ ఏరియాలు, రోడ్లపై వాహనాలను నిలిపితే చర్యలు తప్పవని హెచ్చరికలు చేస్తున్నారు. ఇప్పటి వరకు ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించిన వాహనదారులపై ఈ-చలాన్, స్పీడ్ గన్, వాహన తనిఖీల ద్వారా జరిమానా విధించే వారు. ఇకపై టైర్ లాక్ విధానంతో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టిని సారిస్తున్నారు. ఇందుకు గాను ట్రాఫిక్ పోలీసులు నాలుగు వెహికిల్ టైర్ లాక్‌లను ఏర్పాటు చేశారు. జిల్లాకేంద్రంలోని వినాయక్‌చౌక్, నేతాజిచౌక్, అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్‌లలో నిత్యం తీవ్రమైన ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితులను అధిగమించేందుకు పోలీసులు కొత్త విధానాన్ని అమలు చేస్తు వాహనదారులను అప్రమత్తం చేస్తున్నారు. గతంలో ఈ-చలాన్ విధానంపై తీవ్ర విమర్శలు రావడంతో గత కొంత కాలంగా జరిమానాలు విధించడం నిలిపి వేశారు. మళ్లీ కొత్త విధానాన్ని అమలు చేయడం పై వాహనదారుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నో టాకింగ్.. ఓన్లీ ఫైన్!!

రోడ్లపై నిర్లక్ష్యంగా వాహనాలను నిలిపితే టైర్ లాక్ విధానం ద్వారా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా భారీ వాహనాల ట్రాఫిక్ నియంత్రణకు వీలుంటుంది. ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాలను రోడ్లపై నిలిపితే టైర్‌లాక్‌తో సంబంధిత వాహన యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. భారీ వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించే ఇబ్బందులు కూడా దూరమవుతాయి. భారీ వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించాలంటే ప్రత్యేకమైన క్రేన్ సహాయం అవసరం ఉంటుంది. ఇలాంటి ఇబ్బందులు లేకుండానే ఈ-చలాన్ ద్వారా జరిమానా విధించవచ్చు. ఇకపై వాహనదారుల కోసం ఎదురుచూసే అవసరం ఉండదు. ఒకవేళ వాహనదారుడు అందుబాటులో ఉన్న వాహనాన్ని స్టార్ట్ చేసి తీసుకెళ్లేందుకు పోలీసులు ఇబ్బంది పడే అవసరం లేదు. అంతేకాకుండా టైర్‌లాక్ చేసిన వెంటనే సంబంధిత వాహనదారుడు పోలీసులను సంప్రదిస్తే హెచ్చరించి జరిమానా విధించే అవకాశం ఉంటుంది. అలాగే పోలీసులు వాహనదారులతో రోడ్లపై ఘర్షణ పడే ఆస్కారం కూడా ఉండదంటున్నారు. లాక్ పడిందో 'నో టాకింగ్.. ఓన్లీ ఫైన్' అనే పరిస్థితి తప్పదంటున్నారు.

రాంగ్ పార్కింగ్‌పై చర్యలు

ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలను రాంగ్ పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా నో పార్కింగ్ ఏరియాలతో పాటు ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రాంతాల్లో భారీ వాహనాలను నిలుపరాదంటూ సూచిస్తున్నారు. టైర్ లాక్ పడిన వాహన యజమానులకు రూ.వెయ్యి వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. విధించిన జరిమానా మొత్తాన్ని వాహనదారుడు మీసేవ కేంద్రాల్లో చెల్లించి సంబంధిత రశీదును చూపితే వాహనానికి టైర్‌లాక్ తీసే అవకాశం ఉంటుంది. ఇలా వరుసగా మూడు సార్లు టైర్‌లాక్ పడితే మరింత కఠినంగా వ్యవహరించాల్సి ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. చిన్నపాటి నిర్లక్ష్యంతో వాహనదారులు డబ్బు, సమయం వృథా చేసుకోవద్దని సూచిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని పేర్కొంటున్నారు. అయితే జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో ఆటోలు, ద్విచక్ర వాహనాలు రద్దీతో జనం తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా అంబేద్కర్‌చౌక్, గాంధీచౌక్, వినాయక్‌చౌక్, బస్టాండ్ ఏరియా, నేతాజీచౌక్‌లలో పోలీసులు ప్రత్యేకదృష్టిని సారిస్తే ట్రాఫిక్ సమస్యలు దూరమవుతాయి. అలాగే రోడ్లపై పశువుల సంచారం విచ్చలవిడిగా పెరిగి పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. టీఎస్‌టీవోస్ రోడ్డు మార్గంలో అంబేద్కర్‌చౌక్ వరకు కొన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, షాపింగ్‌మాల్స్, ఇతర వ్యాపార సముదాయాల ముందు అడ్డదిడ్డంగా వాహనాలను పార్కింగ్ చేయడంతో పట్టణ ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీనిపై స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్ గతంలోనే పోలీసులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పరిశీలించినా.. మార్పు మాత్రం కనిపించడం లేదు. ఇకనైనా ప్రధాన రహదారులపై ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పోలీసు లు ప్రత్యేకదృష్టిని సారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.



ఈ ఫొటోల్లో అడ్డదిడ్డంగా రోడ్డుపై వాహనాలను నిలిపి ఉంచిన దృశ్యాలు. జిల్లాకేంద్రంలోని టీఎన్జీవోస్ హోం రోడ్డు మార్గంలో కనిపిస్తున్న పరిస్థితి. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఓ ప్రైవేట్ ఆసుపత్రి ముందు రోడ్డు పైననే ఆటోలను పార్కింగ్ చేయడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇలాంటి పరిస్థితులు జిల్లా కేంద్రంలోని చాలాచోట్ల కనిపిస్తున్నాయి. ఇకనైనా ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టిని సారించాలని పట్టణవాసులు కోరుతున్నారు.



జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

: జీవన్‌రెడ్డి, డీఎస్పీ, ఆదిలాబాద్



జిల్లాకేంద్రంలో ఏర్పడుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నాం. టైర్‌లాక్ విధానంతో భారీ వాహనాల నియంత్రణకు అవకాశం ఉంటుంది. నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల పై వాహనాలను నిలిపితే ఫైన్ తప్పదు. నో పార్కింగ్ ప్రాంతాల్లోను వాహనాలను పార్కింగ్ చేయరాదు. టైర్‌లాక్ పడిన వాహనదారులకు వెయ్యి వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. జిల్లా కేంద్రంలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు.

సంక్షిప్త సమాచారం



వడ్డాడి వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై

వాహనాల తనిఖీ

తాంసి, ఆగస్టు 23: వాహనాలు నడిపే వ్యక్తులు పూర్తిస్థాయి ధ్రువపత్రాలు కలిగి ఉండాలని తాంసి ఎస్సై శివరాం అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని వడ్డాడి ఎక్స్ రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేశారు. దీనిలో భాగంగా ఎవరి వద్ద అయితే పూర్తిస్థాయి పత్రాలు లేవో అలాంటి వాహనాలను సీజ్ చేశారు. హెల్మెట్ లేని వ్యక్తులపై సైతం జరిమానాలు దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై శివరాం మాట్లాడుతూ ప్రతీఒక్కరు హెల్మెట్‌తో పాటు పూర్తిస్థాయి పత్రాలు కలిగి ఉండాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన తరువాతనే మోటారు సైకిల్ నడపాలని లేనిపక్షంలో కేసులు నమోదు చేసి జరిమానా విధించడం జరుగుతుందన్నారు. మితీ మీరిన వేగాన్ని తగ్గించాలని, ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వాహనాలు నడపాలని సూచించారు. ఈ సందర్భంగా పలు వాహనాలను తనిఖీ చేశారు.

దివ్యాంగులకు ఉపాధి శిక్షణ

ఉట్నూర్, ఆగస్టు 23: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని దివ్యాంగులు 40,100 శాతం సదరం సర్టిఫికేట్ కలిగి ఉన్న నిరుద్యోగ గిరిజన యువతీ, యువకులకు యూత్ ఫర్ జాబ్స్ రిటైల్, హాస్పిటలిటి, బీఎఫ్ఎస్ఐ కోర్సులలో రెండు నెలల పాటు హైదరాబాద్‌లో శిక్షణ, భోజన వసతి కల్పించి శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశం కల్పిస్తారని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35ఏళ్ల లోపు వారు పదవ తరగతి పాస్ లేదా ఫెయిల్, ఇంటర్మీడియట్, డిగ్రీ చదివి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 30న ఉట్నూర్‌లోని గిరిజన ఉపాధి శిక్షణ కేంద్రంలో దరఖాస్తులు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలను సెల్ నెం.9010295910, 9666748105, 8008087088ల ద్వారా సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు

● సీపీవో వెంకటరమణ

తాంసి, ఆగస్టు 23: ప్రస్తుతం వర్షాకాలం అయినందున వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంటుందని ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీవో, మండల ప్రత్యేక అధికారి వెంకటరమణ అన్నారు. శుక్రవారం మండలంలోని బండల నాగపూర్, గొట్కూరి గ్రామాలలో పారిశుధ్యం పనులను పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి ఎక్కడైనా మురికి నీరు నిల్వ ఉందో? లేక మురికి కాలువలు అపరిశుభ్రంగా ఉన్నాయో? చెత్త, ముళ్లపొదలు ఎక్కడైనా ఉన్నాయో? ఆరా తీశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీవో మాట్లాడుతూ వ్యాధులు ప్రబలినట్లయితే వెంటనే సమాచారం అందించాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అదేవిధంగా తాంసి ప్రభుత్వ వైద్యశాలలో సకల సౌకర్యాలు ఉన్నాయని, ప్రతిఒక్కరూ ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గడ్డం మోహన్‌రెడ్డి, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా ● సిరికొండ మండలం తిమ్మాపూర్ గ్రామంలో డీఆర్‌డీఏతో కలిసి పిండిగిర్నీ, ఆయిల్‌మిల్‌ను ప్రారంభించిన కలెక్టర్



కలెక్టర్‌కు ఘన స్వాగతం పలుకుతున్న ఆదివాసీలు



సిరికొండలోని ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్

సిరికొండ, ఆగస్టు 23: మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం మండలంలో కలెక్టర్ రాజార్షి షా, డీఆర్‌డీఏ సాయన్నతో కలిసి తిమ్మాపూర్ గ్రామంలో పిండిగిర్నీ, ఆయిల్ మిల్‌ను ప్రారంభించి పలు సమస్యలపై చర్చించారు. అంతకుముందు గ్రామానికి విచ్చేసిన కలెక్టర్‌కు గ్రామస్థులు కలెక్టర్ కాళ్లు కడిగి, సంప్రదాయబద్ధంగా మంగళ హారతులతో, మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ గిరిజన పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి, గ్రామానికి చెందిన కోట్నాక్ లక్ష్మి అనే మహిళ, ఇందిరా మహిళా శక్తి పథకం కింద రూ.2లక్షల 30 వేలతో బ్యాంకు రుణం పొంది ఏర్పాటు చేసిన పిండిగిర్నీ, ఆయిల్ మిల్‌ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం పల్లి నూనె తీసే విధానాన్ని పరిశీలించి, పల్లి నూనెతో పాటు పలు రకాల నూనెలను పరిశీలించారు. అనంతరం గ్రామస్థులు ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళాశక్తి పథకం ద్వారా 15 రకాల సహకారాలను అందిస్తోందని, ఎంటర్ ప్రైజెస్, వ్యక్తిగత రుణాలు, షాపులను పెట్టేందుకు మహిళా సంఘాల ద్వారా రుణాలు పొంది ఉపాధి పొందాలని సూచించారు. సిరికొండ మండలంలో 219 యూనిట్లు మంజూరు కాగా, 6 యూనిట్లను గుర్తించడం జరిగిందని అన్నారు. దీనితోపాటు వాతావరణానికి తగ్గట్టు మేలు జాతి గేదేలు, ఆవులు తీసుకొని పాల ఉత్పత్తుల ద్వారా లబ్ధి పొందవచ్చునని తెలిపారు. వీటి అమలు కోసం కమిటీ వేయడం జరిగిందని, ఈ కమిటీలో మహిళా సంఘాల అధ్యక్షులు, ఏపీఎం, వెటర్నరీ డాక్టర్, ఎంపీడీవోలు ఉంటారని అన్నారు. పది, ఇంటర్, డిగ్రీ చదివి మధ్యలో ఆపేసిన వారికి ఖాళీగా ఉన్నవారికి పీఎంజీపై కింద రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉందని, తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తే మళ్లీ తీసుకునేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు. కాగా, గ్రామస్థులు పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, సానుకూలంగా స్పందించి పరిష్కరిస్తామని తెలిపారు. ఆ తర్వాత సిరికొండలో ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఏర్పాటు చేసిన దాల్ మిల్‌ను కలెక్టర్ పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిరికొండ మండల సమైఖ్య సర్వసభ్య సమావేశంలో పాల్గొని, మహిళా సంఘాల సభ్యులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలులో స్వయం సహాయక సంఘాల పాత్ర కీలకమన్నారు. చదువు, నైపుణ్యం ఉండి గ్రామాల్లో సరైన ఉపాధి దొరకక, ఉపాధికి దూరమవుతున్న మహిళలకు ఇందిర మహిళా శక్తి పథకంతో స్వయం ఉపాధిని పొందవచ్చన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకు రెండవ విడత యూనిఫామ్స్ తయారీని త్వరగా పూర్తి చేయాలని, మొదటి విడత కింద విద్యార్థుల టకు యూనిఫామ్స్ కుట్టిన మహిళా సంఘాల సభ్యులకు నిధులు రెండు, మూడు రోజుల్లో చెల్లించడం జరుగుతుందని అన్నారు. ప్రతీ శుక్రవారం ఫ్రైడే-డ్రైడేను నిర్వహించాలని, పరిసరాల పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని, రోడ్లపై నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సాయన్న, తహసీల్దార్ ఉపేందర్, ఎంపీడీవో రవీందర్, ఏపీఎం సంతోష్, ఏపీవో భీంరావ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ జైపాల్, ఎంఈవో రాథోడ్ ఉదయ్‌రావు, సంబంధిత శాఖల అధికారులు, మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్‌లు, గ్రామస్థులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రుణమాఫీ అందని రైతులు దరఖాస్తు చేసుకోవాలి : వ్యవసాయాధికారి

తలమడుగు, ఆగస్టు 23: రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందిస్తున్న రుణమాఫీ అందని రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ప్రమోద్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొన్ని బ్యాంకుల అధికారుల నిర్లక్ష్యంతో కొంత మంది రైతులకు రుణమాఫీ అందలేదని, అదేవిధంగా రూ.2లక్షలపైగా ఉన్న రైతులు ఒకే కుటుంబంలో రెండు, మూడు పట్టా పాస్ బుక్‌లు, బ్యాంకులో రుణాలు ఎక్కువ ఉండటం వల్ల కొన్ని సాంకేతిక లోపం వల్ల రుణమాఫీ కాని రైతులందరూ పట్టా పాస్ బుక్, ఆధార్ కార్డు ఇతర వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. దరఖాస్తు ఫారాలను ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు మండలంలో దాదాపు 300 మంది రైతులకు పైగా దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. రైతులెవరూ ఆందోళన చెందవద్దని, అర్హులు అందరికీ రుణమాఫీ వర్తిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఏఈవో రమేష్, రైతులు పాల్గొన్నారు.



రుణమాఫీ కానీ రైతుల నుంచి దరఖాస్తు స్వీకరిస్తున్న అధికారి ప్రమోద్‌రెడ్డి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి : అదనపు కలెక్టర్ శ్యామలదేవి

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 23: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. శుక్రవారం పట్టణంలోని బాలికల హైస్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలతో పాటు వంట గదిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామల దేవి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పౌష్టికాహారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. నిర్వాహకులు కూడా పిల్లలను సొంత పిల్లలగా చూసుకుంటూ నాణ్యమైన భోజనం పెట్టాలని, ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, భోజనం బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమేష్ రెడ్డి, ఉపాధ్యాయులు ప్రతిమ, సులోచన, సారఖాతూన్, తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలి

నేరడిగొండ, ఆగస్టు 23: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కార్యకర్తలతో కలిసి ఆయన మాట్లాడారు. రైతులకు మాయ మాటలు చెప్పి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు తీరా రైతులను నట్టేటా ముంచుతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పునరాలోచించి రైతులకు వెంటనే రూ.2లక్షల వరకు రుణమాఫీ చేయాలని పేర్కొన్నారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు గాదె శంకర్, గోపి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



సంఘీభావం తెలుపుతున్న ఆదివాసీ గిరిజనులు

తుడుందెబ్బ ఆధ్వర్యంలో 27న ఏజెన్సీ బంద్

ఉట్నూర్, ఆగస్టు 23: ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాలని,ఐటీడీఏలో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, జీవో 3ని కొనసాగించాలని కోరుతూ ఈనెల 27న ఏజెన్సీ బంద్‌కు పిలుపు ఇచ్చినట్లు తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పురక బాపురావు తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలోని గుస్సాడిగుట్టలో ఉన్న గొండ్వానా పంచాయతీ రాయిసెంటర్ భవనంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బతో పాటు ఆదివాసీ సంఘాలు రాయిసెంటర్ సార్‌మేడిలతో సమావేశం ఏర్పాటు చేసుకున్నామన్నారు. ఏజెన్సీ ప్రాంత రక్షణకై చట్టాలు పకడ్బందీగా అమలు చేయాలని, 29 శాఖలలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరుతూ ఈనెల 27న ఏజెన్సీ ప్రాంత బంద్‌కు పిలుపునివ్వడం జరిగిందని, 9తెగల ప్రజలు, నాయకులు యువతీ, యువకులు, కార్మిక, కర్షక, కళాకారులు, ఆదివాసీ సంఘ నాయకులతో పాటు అన్నివర్గాల ప్రజలు వ్యాపారస్థులు ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని తీర్మానం చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో మేస్రం దుర్గు, పంద్ర జైవంత్‌రావు, నైతం చిత్రు, ఆత్రం తిరుపతి, ఆడ హన్మంత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

'డెంగ్యూ కేసులపై జాగ్రత్తలు పాటించాలి'

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 23: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కృష్ణ సూచించారు. డ్రై డే డ్రై డేలో భాగంగా జిల్లాకేంద్రంలోని హ్యాండిక్యాప్ కాలనీలో పర్యటించారు. ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి ప్రజలకు సూచనలు చేశారు. వర్షకాలంలో డెంగ్యూ కేసులు పెరుగుతున్నందున తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు సైతం బాధ్యతగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టండి

తలమడుగు, ఆగస్టు 23: గ్రామాల్లో గల బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి జనవరి 2025 వరకు 18ఏళ్లు నిండే ప్రతీ ఒక్కరికి ఓటరు జాబితాలో పేరు నమోదు చేయాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అక్టోబర్ 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. అదేవిధంగా ఓటరు జాబితాలో పేరు మార్పు, ఇతర మార్పులు, చేర్పుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో గల బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి అర్హులైన లబ్ధిదారులందరికీ ఓటు హక్కు కలిగే విధంగా చూడాలని ఆయన పేర్కొన్నారు. ఇందులో డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకర్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరీ బాధ్యత

నార్నూర్, ఆగస్టు 23: పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరీ బాధ్యత అని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, వ్యాధుల బారిన పడకుండా గ్రామప్రజలు ఆరోగ్యం కాపాడుకోవాలని ఎంపీడీవో జవహర్‌లాల్ సూచించారు. పారిశుధ్య కార్యక్రమం భాగంగా మండలంలోని విజయనగర కాలనీలో శుక్రవారం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. వర్షాకాలం గ్రామంలో ఉన్న వీధికాలువలు చెత్త పిచ్చిమొక్కలను,పెంట కుప్పలను గ్రామపంచాయతీ మల్టీపర్పస్ సిబ్బంది చేత పారిశుధ్య పనులను చేయించారు. శుక్రవారం డ్రైడేలో భాగంగా వైద్యులు రాంబాబు వార్డులో ప్రజలకు దోమల నివారణ పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇంటింటికీ తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పగటి పూట కుట్టే దోమల వల్ల డెంగ్యూ, చికెన్‌గున్యా వ్యాధులు ప్రబలుతాయని, నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఇళ్లలో పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో స్వప్నశీల, ఆశావర్కర్ గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.


పరిసరాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

పాఠశాలలో ఘనంగా స్పేస్ డే

తలమడుగు, ఆగస్టు 23: సుంకిడి ఉన్నత పాఠశాలలో స్పేస్‌డేను ఘనంగా నిర్వహించారు. అంతరిక్షంలోకి భారత్ ఇస్రో శాస్త్రవేత్తలు చంద్రయాన్-3ని విజయవంతంగా పంపిన రోజును పురస్కరించుకుని మండలంలోని సుంకిడి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఐఎస్‌ఆర్‌వో అక్షరాలను 130 మంది విద్యార్థులు ఏర్పాటు చేసి జయహో ఇస్రో నినాదాలతో హోరెత్తించారు. ఆ తరువాత పాఠశాలలో విద్యార్థులకు చంద్రయాన్-3పై ఉపన్యాసం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, స్వామి, రామ్‌రెడ్డి, గజానన్, సుకుమార్, పెట్కూలే సుజాత టీచర్, సంజీవ్‌రెడ్డి, పీడీ నాందేవ్ తదితరులు పాల్గొన్నారు.

తాంసి మండలంలో భారీ వర్షం

తాంసి, ఆగస్టు 23: మండలంలోని ఆయా గ్రామాలల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గంటన్నర పాటు ఏకధాటిగా వర్షం కురియడంతో పంట పొలాలు, వాగులు, వంకలు పొంగి పొర్లాయి. మత్తడి వాగు ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 277.50 మీటర్లు కాగా శుక్రవారం సాయంత్రానికి పూర్తిస్థాయి నీటి మట్టానికి చేరుకుంది. ఒక్కసారిగా వర్షం కురవడంతో పంట పొలాల్లో ఎక్కడికక్కడ నీరు చేరింది. దీంతో పంటలకు తెగుళ్లు, వ్యాపించే అవకాశాలు ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు.

ముక్రా(బి)లో ధ్యాన కేంద్ర వార్షికోత్సవం

ఇచ్చోడ, ఆగస్టు, 23: మండలంలోని ముక్రా(బి) గ్రామంలో శుక్రవారం శ్రీ సంత్ సద్గురు పూలాజీబాబా 24వ ధ్యానకేంద్ర వార్షికోత్సవ వేడుకలను గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ధ్యానకేంద్రం ముందర ఉన్న ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భజన సంకీర్తన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి గ్రామస్తులు మహాప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో ధ్యాన కేంద్ర కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠాపన

ఉట్నూర్, ఆగస్టు 23: మండలంలోని షాంపూర్‌లో శుక్రవారం నూతన ఆలయంలో విఠల్ రుక్మాబాయి విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. షాంపూర్‌కు చెందిన మహారాజ్ జ్ఞానోబా మౌళి ఆధ్వర్యంలో గ్రామస్థులు భజనలు చేస్తూ విగ్రహాలను ఊరేగించారు. అనంతరం మహారాష్ట్రలోని ఆలంది ప్రాంతంలోని పూనేకు చెందిన పూజారుల వేదమంత్రాల మధ్య విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు.

కుక్కల బెడదను తగ్గించేందుకు చర్యలు

ఆదిలాబాద్ రూరల్, ఆగస్టు 23: ఆదిలాబాద్‌లో కుక్కల బెడదను తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన స్వచ్ఛందనం పచ్చదనంలో భాగంగా కుక్కలను గుర్తించేందుకు సర్వే జరిపామని ఆయన తెలిపారు.

మహిళా సంఘాల అభివృద్ధికి కృషి చేయండి

● ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్


జైనథ్‌లో పాలకేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జైనథ్, ఆగస్టు 23: జైనథ్ మండలంలోని ఆయా గ్రామాలలో గల మహిళ స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధికి అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయలశంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన జైనథ్‌లో వీవో అధ్యక్షురాలు రూ.2లక్షల వ్యయంతో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన తెలంగాణ విజయడైరీ పాల కేంద్రాన్ని అధికారులు ఇందిరమ్మ మండల సమాఖ్య మహిళలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్దిదారులకు సర్టిఫికేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ మహిళా సంఘాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తుందన్నారు. మహిళా ఉపాధి కల్పనకు వేల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభు త్వం రుణాల రూపంలో అందిస్తుందన్నారు. స్వశక్తితో మహిళలు ఎదిగినప్పుడే ఆర్థిక స్వయం సమృద్ధి సాధించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా డీఆర్‌డీవో ఏపీడీ బి.నిలేష్, మైక్రో ఎంటర్ ప్రైజేస్‌మిల్క్ పార్లర్ డీపీఎం సుగంధ, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా విజయ డైరీ జీఎం మధుసూదన్, అధికారి సాంబశివ్, తహసీల్దార్ శ్యాంసుందర్, ఎంపీడీవో ఎ.రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి...

ఆదిలాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పని చేయాలని ఎమ్మెల్యే పాయలశంకర పేర్కొన్నారు. శుక్రవారం బేల మండలంలోని అవల్‌పూర్ గ్రామంలో పార్టీ చేరికల కార్యక్రమంకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ బోయర్ తిరుపతితో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు 100కు పైగా ఎమ్మెల్యే సమక్షంలో బీజేపీ పార్టీలో చేరారు. కాగా వీరికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అసెంబ్లీ కన్వీనర్ విజయ్‌బోయర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్‌ఠాక్రె, ఆదినాథ్, మండల అధ్యక్షుడు దత్తానిక్కం, జైనథ్ మండల అధ్యక్షుడు రాందాస్, మాజీ సర్పంచ్‌లు, ఇంద్రశేఖర్, రాకేష్, వివేక్, తేజ్‌రావు, శివకుమార్, బోనిగిరివార్ గణేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు నవీన్‌పోత్‌రాజ్, బీజేపీ జనరల్ సెక్రటరీ సందీప్‌ఠాక్రె, ప్రవీణ్‌కుమార్, నారాయణ, బర్కాడే రాము, ప్రమోద్‌రెడ్డి, ధర్నే జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

● బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్


ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

నేరడిగొండ, ఆగస్టు 23: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండలంలోని ఇస్పూర్ గ్రామంలో శుక్రవారం నూతన హనుమాన్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు గ్రామాల్లోని ఆలయాల్లో పూజ కార్యక్రమాలు చేపట్టడంతో దైవభక్తి నెలకొంటుందన్నారు. యువత చెడు వ్యసనాలకు వెళ్లకుండా దైవ నామస్మరణతో ఆధ్యాత్మికం వైపు పయనించాలని సూచించారు. కార్యక్రమంలో తాజా మాజీ ఎంపీపీ రాథోడ్‌సజన్, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ రమేష్, హనుమాన్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బోథ్ సహకార చైర్మన్ పదవిపై కాంగ్రెస్ నజర్!

బోథ్, ఆగస్టు 23: బోథ్ సహకార సంఘం చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకుల పావులు కదుపుతున్నారు. అందులో భాగంగానే గత రెండు రోజుల క్రితం ఆయనను పదవి నుంచి తొలగించాలని కోరుతూ జిల్లా కో-ఆపరేటివ్ అధికారికి వినతిపత్రం ఇచ్చారు. సోమవారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలని కోరుతూ జిల్లా కో-ఆపరేటీవ్ అధికారికి అందించను న్నారు. అయితే 13 మంది సహకార సంఘం డైరెక్టర్లు ఉండగా అందులో నుంచి ఏడుగురు మంది కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. గత నాలుగు సంవత్సరాల క్రితం జరిగిన సహకార సంఘం ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో సహకార సంఘం చైర్మన్ పదవిని కైవసం చేసుకుంది. అయితే అప్పట్లో జరిగిన చైర్మన్ ఎంపికలో కాంగ్రెస్ పార్టీకి ఏ ఒక్క డైరెక్టర్ కూడా మద్దతు లేరు. ప్రస్తుత ఎంపీ జి.నగేష్ సహకారంతో కదం ప్రశాంత్ పదవిని కైవసం చేసుకున్నారు. ప్రస్తుతం మారిన రాజకీయ పరిణామాలలో జి.నగేష్ జిల్లా ఎంపీగా గెలుపొందడం ఆయన మద్దతు దారుడైన ప్రస్తుత చైర్మన్‌ను ఆ పదవి నుంచి తప్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎత్తుగడ వేశారు. అందులో భాగంగానే సోమ వారం ఆయనపై అవిశ్వాసం పెట్టాలని ఏడు గురు మంది సహకార సంఘం డైరెక్టర్లు జిల్లా కో- ఆపరేటీవ్ అధికారికి వినతిపత్రం ఇవ్వను న్నా రు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటం అందుకుతోడు డైరెక్టర్లు కాంగ్రెస్ పార్టీలో చేరడం వల్ల చైర్మన్ గిరి నుంచి కదం ప్రశాంత్ ను తప్పించనున్నట్లు సమాచారం. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడితే రాజకీయం మారనుంది.

గిరిజన పాఠశాలల్లో ఫలితాలు పెంచుదాం

● ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్త


ఒప్పంద పత్రాలను చూపిస్తున్న ఐటీడీఏ పీఓ, తదితరులు

ఉట్నూర్, ఆగస్టు 23: ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యా ఫలితాలను మెరుగుపరిచేందుకు విభా, లీఫ్ ఫర్ వర్డ్‌తో మెమోరాడం ఆఫ్ అండర్‌స్టాండింగ్ (ఎంవోయూ) కుదుర్చుకుందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్త తెలిపారు. శుక్రవారం ఈ ఒప్పందం కింద ఆంగ్ల సాక్షరత కార్యక్రమం(ఈఎల్పీ) ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని గిరిజన పాఠశాలల్లో అమలు చేయనుందన్నారు. ఈ ఒప్పందం తెలంగాణ రాష్ట్రంలోనే తొలిసారి కుదుర్చుకోవడం విశేషమని, ముఖ్యంగా ఐటీడీఏ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆంగ్ల భాష నైపుణ్యాలను మెరుగు పరచడమే దీని లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ జనరల్ జాదవ్‌వసంత్‌రావు, వీరనారాయణ (విజయవాడ), చైతన్య చక్రవర్తి (విజయవాడ), ప్రనిల్‌నాయక్ (ముంబై), క్షితిజ్ (బెంగళూరు)లు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని బాలాపూర్ వాసి మృతి

జైనథ్, ఆగస్టు 23 : ఆదిలాబాద్ మండలంలోని చాందా(టీ) రిలయన్స్ పెట్రోల్‌బంక్ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం పదిగంటల ప్రాంతంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో జైనథ్ మండలంలోని బాలాపూర్ గ్రామానికి చెందిన పుప్పలభూమన్న(45) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఆదిలాబాద్ రూరల్ సీఐ కె.మణి దర్, ఎస్సై సయ్యద్ ముజాయిద్‌ల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. మృతుడు పుప్పల భూమన్న ఎప్పటిలాగే ఎలక్ట్రికల్ మెకానిక్ కోసం జైనథ్ మండలంలోని బాలాపూర్ గ్రామం నుంచి ఆదిలాబాద్‌కు లూనాపై వెళ్తుండేవాడని తెలిపారు. లూనాను వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారని తెలిపారు. మృతునికి భార్య అమానితో పాటు ఒక కొడుకు కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు శవపంచనామ నిర్వహించి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలోని మార్చురిగదికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆదిలాబాద్‌రూరల్ ఎస్సై సయ్యద్ ముజాయిద్ తెలిపారు.

'సైబర్ నేరాలపై అవగాహన అవసరం'

నేరడిగొండ, ఆగస్టు 23: మండలంలోని పోలీసుస్టేషన్ పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంను డీ ఎస్సై హసిబుల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఫేక్ గేమ్‌యాప్‌లు, బ్యాం క్, ఇతర విభాగాల నుంచి రుణాల మోసాలు, నమోదు కానీ ట్రావెల్ ఏజెంట్లు, కంబోడియా వంటి సౌత్ ఈస్ట్ దేశాలకు పంపడం వంటి చాలా నేరాల గురించి వివరించారు. ఇలాంటివి ఏమన్నా జరిగినప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ 1930కి రిపోర్టింగ్ చేయాలన్నారు.

'ఇంకుడు గుంతలతో భూగర్భ జలాల అభివృద్ధి'

ఉట్నూర్, ఆగస్టు 23 : కలెక్టర్ ఆదేశాల మేరకు ఉట్నూర్ మండల ప్రత్యేకఅధికారి సుధాకర్ గ్రామాలలో పర్యటిస్తున్నారు. శుక్రవారం ఉట్నూర్ మండలంలోని దివంగత ఐఏఎస్ అధికారి మడావి తుకారం సొంత గ్రామమైన లక్కేటిపేట్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రజలు కూడా సహకరించాలని, పంచాయతీ ఆధ్వర్యంలో రోడ్లు, మురికి కాలువలు పరిశుభ్రం చేయడం జరుగుతుందన్నారు. ఇండ్ల నుంచి బయటకు వస్తున్న వృధా నీటిని ఇంకుడు గుంతలు నిర్మించుకొని భూమిలో ఇంకేలా చేయాలని తద్వారా భూగర్భజలాలు అభివృద్ధి చెందుతాయన్నారు. మండల పంచాయతీ అధికారి మహేశ్‌కుమార్, ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ ప్రజలు గ్రామపటేల్ అందరు కలిసి ఆధ్వర్యంలో గ్రామంలో వీధి వీధి తిరుగుతు అన్ని సమస్యలు తెలుసుకొని వాటికి పరిష్కార మార్గాలను గ్రామసభ పెట్టి గ్రామసభలో తీర్మాణించడం జరిగిందని ప్రత్యేక అధికారి సుధాకర్ వివరించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన కంది దంపతులు


సీఎంను కలిసిన కంది

ఆదిలాబాద్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి ఆయన సతీమణి కం ది మౌనా రెడ్డిలు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం సోదరుడు జగదీశ్‌రెడ్డి కుమార్తె రుత్విక వివాహనిశ్చితార్థ వేడుకలకు హాజరయ్యారు. రుత్విక-అబిజిత్ దంపతులను ఆశీర్వదించారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను కాపాడిన పోలీసులు


కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసు అధికారులు

తలమడుగు, ఆగస్టు 23: ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం ఉమ్మడం గ్రామ సమీపంలో ఓ మహిళ అంతర్ రాష్ట్ర రహ దారిపై ఆత్మహ త్యాయ త్నానికి పాల్పడగా పోలీసులు కాపాడారు. రోడ్డుపైన పడుకుని ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొని ఆత్మహత్య చేసుకునేందుకు యత్నిస్తుండగా అటుగా వెళుతున్న పోలీసు అధికారులు ఆమెను గమనించారు. ఆమెకు నచ్చజెప్పి ఆత్మహత్య చేసుకోకుండా కాపాడారు. దాదాపు రెండు గంటల పాటు అక్కడే ఉండి, తలమడుగు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకుని ఆమె వివరాలు అడిగి తెలుసుకుని జిల్లా కేంద్రంలో నివాసం ఉంటున్న వారి కుటుంబసభ్యులకు అప్పజెప్పారు. ఆమె ప్రాణాలు కాపాడిన సిబ్బందిని తాంసి మాజీ సర్పం చ్ కృష్ణ, పలువురు పోలీసులను అభినందించారు.

జడ్పీ సీఈవోని కలిసిన నాయకులు

ఆదిలాబాద్ అర్బన్, ఆగస్టు 23: జిల్లా పరిషత్ సీఈవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జితేందర్‌రెడ్డిని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మ సంతోష్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి శాలువా, పుష్ప గుచ్ఛంతో సన్మానించారు. వీరితో పాటు ఆదిలాబాద్‌రూరల్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అల్చెట్టి నాగన్న, అల్లాబకాష్, తదితరులున్నారు.

పిడుగుపాటుకు ఎద్దు మృతి

ఉట్నూర్, ఆగస్టు 23: మండలంలోని మారుతిగూడ సమీపంలో శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి తోడు పిడుగు పడడంతో ఒక ఎద్దు మృతి చెందగా ఒక గిరిజనుడికి తీవ్రగాయాలు అయ్యాయి. మారుతినగర్‌కు చెందిన కొత్తగూడ మాజీ ఉప సర్పంచ్ గంగారాంకు చెందిన ఎద్దుపై పిడుగు పడడంతో ఎద్దు మృతిచెందగా గంగారాం కాలికి గాయాలయ్యాయి. వెంటనే అతన్ని ఉట్నూర్ ఆసుపత్రికి తరలించడం జరిగిందని మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు తెలిపారు.

ఉపాధ్యాయ సంఘ సభ్యత్వ నమోదు ప్రారంభం

ఉట్నూర్, ఆగస్టు 23: మండలంలోని ఎస్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం శుక్రవారం చేపట్టామని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మూగ శ్రీనివాస్, జాదవ్‌అశోక్ కుమార్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని యాజమాన్యాలతో ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతులు చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా పెండింగ్‌లో ఉన్నటువంటి డీఏలను వెంటనే మంజూరు చేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయ బదిలీలు పదోన్నతులలో తలెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దు చేసిపాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ర్యాగింగ్‌కి పాల్పడి జీవితాలు నాశనం చేసుకోవద్దు

● సీఐ గండికోట మొగిలి

ఉట్నూర్, ఆగస్టు 23: డిగ్రీ విద్యార్థులు ర్యాగింగ్‌కి పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని ఉట్నూర్ సీఐ గండికోట మొగిలి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో కేబీ ప్రాంగణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రతాప్‌సింగ్‌తో పాటుగా సీఐ మొగిలి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐ గండికోట మొగిలి మాట్లాడుతూ కళాశాలలో జూనియర్, సీనియర్ అనే తేడాలు లేకుండా అన్నదమ్ముల వలే ఉంటూ అధ్యాపకులు చెప్పిన విషయాలు శ్రద్ధగా విని ఆచరణలో పెట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సాయిప్రసాద్, ఏఎస్సై దిలీప్‌కుమార్, కళాశాల పీడీ అనిత, అధ్యాపకులు రాణి, నర్సింగ్‌రావు, రవీందర్‌లున్నారు.

దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు

ఉట్నూర్, ఆగస్టు 23 : ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా ఆదేశానుసారం వర్షాకాల నేపథ్యంలో దోమలతో వ్యాపించే డెంగ్యూ మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా ఫాగింగ్ చర్యలు చేపడుతున్నామని ఉట్నూర్ ఏటీడీఓ క్రాంతికుమార్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో దోమల నివారణ కోసం చర్యలు ప్రారంభించామన్నారు. వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిలువకుండా చూడాలని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని ఆశ్రమ పాఠశాలలో దోమల నివారణకు గాను ఒక్కొక్క ఏటీడీఓ కార్యాలయానికి ఒకటి చొప్పునమొత్తం 8 ఫాగింగ్ మెషిన్‌లను ప్రాజెక్టు అధికారి తరఫున సరఫరా చేశారని అన్నారు. వారం రోజులలో అన్ని పాఠశాలలో ఫాగింగ్ పూర్తి చేసే విధంగా ప్రణాళిక తయారు చేసి పూర్తి చేయాలని పీఓ ఆదేశించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసింది

● బీజేపీ శాసన సభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి


ప్రసంగిస్తున్న బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి


వినతి పత్రం అందజేస్తున్న రైతులు

నిర్మల్, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి) : రెండు లక్షల రుణాలను పూర్తిగా మాఫీ చేస్తానని చెప్పి సీఎం రేవంత్ రెడ్డి... కొంతమందికే మాఫీచేసి మిగతా రైతులను మోసం చేశాడని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం నిర్మల్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదురుగా రుణమాఫీపై బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. నిరసన కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న బీజేపీ శ్రేణులతో పాటు పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు బూటకపు హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. ఒకవైపు రాష్ట్ర వ్యాప్తంగా లక్షల సంఖ్యలో రైతులు తమకు రుణమాఫీ కాలేదంటూ రోడ్లపైకి వచ్చి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తుంటే ఈ ముఖ్యమంత్రి మాత్రం రాష్ట్రంలోని రైతులందరికీ రుణమాఫీ చేశామంటూ సంబరాలు చేసుకునేందుకు సిద్ధమవుతుండడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అబద్దాల పునాదుల మీద ఏర్పడ్డ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, ఈ ముఖ్యమంత్రి రైతులనే కాకుండా దేవుళ్లను కూడా మోసం చేశాడని విమర్శించారు.కాగా రుణమాఫీపై ఈ నెలాఖరు వరకు ప్రభుత్వానికి గడువు ఇస్తామని, అప్పటిలోగా ప్రతి రైతుకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. లేకుంటే హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద రైతుల పక్షాన నిరవధిక నిరాహార దీక్షకు దిగుతానని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. రుణమాఫీతో పాటు రాబోయే రోజుల్లో కూడా రైతులకు ఏ కష్టం వచ్చినా బీజేపీ అండగా నిలుస్తుందని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ నగేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మోహన్ రావు పటేల్, ఖానాపూర్ నియోజకవర్గ ఇంచార్జి రితీష్ రాథోడ్, బీజేపీ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, మేడిసెమ్మె రాజు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లాలో ఘోరరోడ్డుప్రమాదం

● ఇద్దరు యువకుల దుర్మరణం ● ఒకరికి తీవ్రగాయాలు

● టీ తాగి.. వస్తుండగా ఘటన


మృతి చెందిన ప్రశాంత్

దిలావర్‌పూర్, ఆగస్టు 23 : నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లోని 61వ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. దిలావర్‌పూర్ మండలంలోని న్యూలోలం గ్రామానికి చెందిన వెంకగారి ప్రశాంత్ (18), నితిన్, మల్లాపూర్ గ్రామానికి చెందిన సంజీవ్ (18)లు మిత్రులు. శుక్రవారం రాత్రి వీరు ముగ్గురూ కలిసి దిలావర్‌పూర్‌కు టీ తాగేందుకు వెళ్లారు. ఆ తర్వాత తిరిగి ఒకే బైక్‌పై ముగ్గురు న్యూలోలం గ్రామానికి వస్తుండగా.. 61వ జాతీయ రహదారిపై ఎదురుగా వచ్చిన కారు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మూడు వైపులా ఎగిరి పడ్డారు. సంజీవ్ రోడ్డు పక్కన ఉన్న పొలంలో ఎగిరి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ఇద్దరిని 108 అంబులెన్స్‌లో స్థానికులు నిర్మల్‌లోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అంబులెన్స్ ఆసుపత్రి వద్దకు చేరుకోగానే వెంకగారి ప్రశాంత్ ప్రాణాలు వదిలాడు. నితిన్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం నిర్మల్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం నితిన్ పరిస్థితి విషమంగానే ఉన్నట్లు వైద్యులు తెలిపారు. రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోవడానికి అతి వేగమే కారణంగా భావిస్తున్నారు. పరస్పరం ఢీకొన్న కారు, బైక్ వేగంగానే ఉన్నట్లు ప్రమాద తీవ్రతను బట్టి తెలుస్తోంది. ఎంతో భవిష్యత్ ఉన్న ఇద్దరు మిత్రులు అర్థాంతరంగా మృత్యువాత పడడం.. మరొకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో.. న్యూలోలం, మల్లాపూర్ గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

సంక్షేమ పథకాలను వంద శాతం అమలు చేయాలి

● ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్

నిర్మల్ అర్బన్, ఆగస్టు 23 : జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాలను వంద శాతం అమలు చేయాలని ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ సమావేశ మందిరంలో ఎంపీ నగేష్ అధ్యక్షతన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, రామారావు పాటిల్, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ సత్యం సహా జిల్లా అధికారులతో జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయల వ్యయంతో చేసిన ప్రగతి పనుల లక్ష్యాలకు సంబంధించి పంచాయతీ రాజ్, జాతీయ రహదారుల విభాగం, గ్రామీణాభివృద్ధి, మెప్మా, బీఎస్ఎన్ఎల్, ఆర్అండ్‌బీ, ఐటీడీఏ, జిల్లా పరిషత్, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, వ్యవసాయ, విద్య, వైద్య, ఆరోగ్య, మహిళా, శిశు సంక్షేమ, నీటి పారుదల, మున్సిపల్ తదితర శాఖలు పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సభ్యులు మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద జాబ్ కార్డు కలిగిన ప్రతి కూలీకి 100 రోజులు పని దినాలు కల్పించాలని సూచించారు. అర్హులైన వారికి పింఛన్ల మంజూరుతో పాటు సదరం క్యాంపులు చేపట్టి ధ్రువపత్రాలను మంజూరు చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా అర్హులైన కుల వృత్తుల వారందరికీ రుణాలు మంజూరు చేయాలని సూచించారు. గిరిజన గ్రామాల్లో పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. నిర్దేశిత ప్రాంతాల్లో వెంటనే బీఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేయాలని, గిరిజన ప్రాంతాల్లో రోడ్లకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలని ఆదేశించారు. పీఎం అమ్మ ఆదర్శ గ్రామ యోజన, అమృత్ పథకంలో మరుగుదొడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని సూచిం చారు. పీఎం అమ్మ ఆదర్శ గ్రామ యోజన, అమృత్ పథకంలో మరుగుదొడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించా లని సూచించారు. జిల్లాలోని మారుమూల గ్రామాలకు సింగల్ ఫేస్ నుండి 3 ఫేస్ విద్యుత్ సౌకర్యం కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేలా ప్రతి గ్రామానికి బీటీ రోడ్డులను ఏర్పాటు చేయాలన్నారు.

పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని నిరసన

నిర్మల్ అర్బన్, ఆగస్టు 23 : ఉద్యోగ ఉపాధ్యాయులకు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి తక్షణమే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరణ చేయాలని కోరుతూ పట్టణంలోని నీటి పారుదల శాఖ ఉద్యోగులు కోరారు. గత ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి జీవో నెంబర్ 28 ద్వారా తామంతా సీపీఎస్ విధానంలోకి వెళ్లామని అందుకే ఆ జీవో విడుదలైన ఆగస్టు 23ను బ్లాక్ డేగా పాటిస్తే ఆ జీవో ప్రతులను కాల్చి వేయడం జరిగిందని వారన్నారు. గౌరవ ముఖ్యమంత్రి వర్యులు ఇస్తామని మేనిఫెస్టోలో పెట్టారని అనుగుణంగా తక్షణమే పాత పెన్షన్ హామీలు నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్, నాయకులు చక్కెర శ్రీనివాస్, శరత్, సంతోష్ సింగ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

ముథోల్ : తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంపాయిస్ యూని యన్ (టీఎస్‌సీపీఎస్ఈయూ) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు 23న జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యా యులందరూ నల్లబ్యాడ్జీలు ధరించి పెన్షన్ విద్రోహ దినాన్ని పాటించడం జరిగిందని, పూర్తిగా విజయవంతం అయిందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు పేర్కొన్నారు. జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయులంతా వారి వారి పాఠశాలల్లో, కార్యాలయాల్లో జీవో నెంబర్ 28 ప్రతులను కాల్చివేశారని ఆయన చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలో సీపీఎస్‌ను అమలులోకి తీసుకు వచ్చిన టువంటి జీవోను అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, కార్యాలయాల్లో కాల్చివేసి నిరసన తెలియజేశా మన్నారు. మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో ఆయన, ఉపాధ్యాయు లంతా నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అమీర్ ఖుస్రు, రాజేశ్వర్, రవి జాదవ్, అంజయ్య, సాయికృష్ణ, స్వర్ణలత, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల : మండల కేంద్రం కుంటాల స్థానిక ఆదర్శ మోడల్ పాఠశాలలో ఉపాధ్యాయులు శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా అధ్యక్షులు కృష్ణారావు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో సీపీఎస్ విధానం అమలుకు కారణమైన గత ప్రభు త్వం తీసుకవచ్చిన జీవోనెం.28 ప్రతులను ఈ సందర్భంగా కాల్చివేశారు.

నర్సాపూర్‌లో వ్యక్తి ఆత్మహత్య

నర్సాపూర్(జి), ఆగస్టు 23 : మండల కేంద్రానికి చెందిన రైతు గొడిసెరం సాయరెడ్డి(28) పంట పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొడిసెరం సాయరెడ్డి గత మూడు సంవత్సరాల నుండి నడుమునొప్పితో బాధపడేవాడని ప్రతీరోజు లాగానే ఉదయం పని నిమిత్తం తన చేనులోకి వెళ్ళి ఇంటికి రాకపోవడంతో తండ్రి మోహన్‌రెడ్డి వెళ్ళి చూడగా చనిపోయి ఉండటంతో కుమారుడు సాయరెడ్డి తన ఆరోగ్యం బాగాలేక జీవితంపై విరక్తి చెంది పురుగుల మందు త్రాగి చనిపోయి ఉంటాడని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మునిగెల హన్మాండ్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 23 : నిర్మల్ పట్టణం గాజుల పేట్‌లో శివాలయం, లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ నిర్మాణాలకు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి భూమి పూజ చేశారు. కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతరిక్ష దినోత్సవం

కుంటాల, ఆగస్టు, 23 : మండల కేంద్ర కుంటాల స్థానిక శాంతినికేతన్ పాఠశాలలో శుక్రవారం అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా చంద్రయాన్-3 మిషన్ ఆగస్టు 23, 2023న చంద్రుడి ఉపరితలంపై విక్రమ్ ల్యాండర్‌ను సురక్షితంగా, సాఫ్ట్‌గా ల్యాండింగ్ చేసిన సందర్భంలో చంద్రుడిపై దిగిన నాలుగో దేశంగా భారతదేశం చరిత్ర సృష్టించిందని ప్రిన్సిపాల్ సంతోష్ అన్నారు. అదేరోజున నేషనల్ స్పేస్‌డేగా నిర్వహించుకుంటున్నామని అన్నారు. చంద్రయా న్-3 విజయానికి ఆగస్టు 23 తేదీన శాస్త్రీయ అంతరిక్ష దినోత్సవంగా జరుపుకోవడం ఇదే మొదటి సారి అని డైరెక్టర్ ప్రవీణ్‌కు మార్ అన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు చంద్రయాన్ -3 నమునాను తయారు చేశారు

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌లోని రబీంద్ర ఉన్నత పాఠశాలలో శుక్రవారం చంద్రయాన్-3 విజయోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆసంవార్ సాయినాథ్ మాట్లాడుతూ... భారతదేశం చంద్రయాన్-3 ప్రయోగం చేయడం ప్రపంచానికే తలమానికమన్నారు. భవిష్యత్ తరాలకు ఆదర్శమన్నారు. అందుకే జాతీయ అంతరిక్ష దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాయినాథ్, కరస్పాండెంట్ రాజేందర్, విద్యార్థులు, తదితరులున్నారు.

ఆటోను ఢీకొట్టిన కారు : ఒకరికి తీవ్రగాయాలు

● కారు డ్రైవర్‌పై దాడి

లక్ష్మణచాంద, ఆగస్టు 23 : మండలంలోని కనకాపూర్, నర్సాపూర్ ఎక్స్‌రోడ్ల వద్ద వేరు వేరు సమయాలలో శుక్రవారం రెండు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఎస్సై సుమలత, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కనకాపూర్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో వేడుకకు హాజరైన కొందరు కారులో ఖానాపూర్ వైపు వెళ్తుండగా కనకాపూర్ గ్రామానికి చెందిన గద్దె అరుణ్ అనే వ్యక్తి పరిమండల్ వైపు వేగంగా వెళ్లి కారును ఢీకొట్టారు. ఈ ఘటనలో అరుణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కారు డ్రైవర్ అయినటువంటి వ్యక్తి దోస గంగాధర్‌పై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డట్టు తెలిపారు. నర్సాపూర్ ఎక్స్ రోడ్ వద్ద జరిగిన మరో ప్రమాదంలో సారంగాపూర్ మండలం వంజర్ గ్రామానికి చెందిన రాంసన్ రామ్ రెడ్డి అను వ్యక్తి ఖానాపూర్ నుండి నిర్మల్‌కు రాంగ్ రూట్ వేగంగా కారు నడుపుతూ నిలిపి ఉంచిన ఆటోను ఢీకొట్టాడు. ఈ ఘటనలో భైంసాకు చెందిన ఆటో డ్రైవర్ బగడే ప్రకాష్, ఈ ఘటన స్థలంలో రోడ్డు ప్రక్కన మక్క బుట్టలు అమ్ముతున్న నర్సాపూర్(డబ్ల్యూ) గ్రామానికి చెందిన వన్నెల ముత్తన్న, మక్క బుట్టలు కొనుగోలు చేస్తున్న ఉత్తర ప్రదేశ్‌కు చెందిన గోవింద సర్కార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. యూపీకి చెందిన గోవింద సర్కార్ వరి నాట్లు వేయడానికి వచ్చి కూలీ డబ్బులు వసూలు చేసుకుని నిర్మల్ వెళ్తూ మక్క బుట్టలు కొనుగోలు చేస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనకు సంబంధించి ప్రమదానికి గురైన వ్యక్తులందరిలో గోవింద సర్కార్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. తీవ్ర గాయాలైన వారందరినీ చికిత్స కోసం నిర్మల్‌లోని ఆసుపత్రికి తరలించారు. వన్నెల ముత్తన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.1 ၊ కనిష్ఠం 24.5

నిర్మల్
జిల్లా వార్తలు
8
శనివారం 24 ఆగస్టు 2024


● జిల్లాకేంద్రంలోని ఎన్‌టీఆర్ మార్గ్ సమీపంలో ఉన్న గొలుసు కట్టు చెరువు ఇదే..


● జిల్లాకేంద్రంలోని ధర్మసాగర్ చెరువు


సరస్వతీ కాలువ ఇదే..

రోడ్లు, చెరువులకు.. మహార్దశ!

- జిల్లాలో రూ.130 కోట్లతో ఆయా పనులకు వేర్వేరుగా ప్రతిపాదనలు
- ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చొరవతో కదిలిన అధికార యంత్రాంగం
- రాష్ట్ర సర్కారు ద్వారా నిధుల మంజూరుకు జోరుగా ప్రయత్నాలు
- చెరువుల ఆధునికీకరణ పనులపై నజర్
- గ్రామాలను లింకేజీ చేసే బీటీ రోడ్ల నిర్మాణం కోసం సంబంధిత అధికారులతో సమీక్ష
- సరస్వతీ కాలువ మరమ్మతులకు సైతం మోక్షం

నిర్మల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత కొన్ని సంవత్సరాల నుంచి పరిష్కారానికి నోచుకోని పలు కీలక సమస్యలవైపు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి సీరియస్‌గా దృష్టి సారిస్తున్నారు. ఇందులో భాగంగానే ప్రధానమైన గ్రామాలకు రోడ్ల నిర్మాణం, అలాగే జిల్లాలో భూగర్భ జలాలకు జీవనాధారమైన చెరువుల ఆధునికీకరణ పనులపై ఆయన నజర్ పెట్టారు. దీనికోసం గానూ జిల్లాలో 14 గ్రామాలను లింకేజీ చేసే బీటీ రోడ్ల నిర్మాణం కోసం ఆయన సంబంధిత అధికారులతో ఇటీవలే సమీక్షించారు. దీంతో పాటు జిల్లా కేంద్రంలోని ఎనిమిది గొలుసుకట్టు చెరువుల మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకోబోతున్నారు. నిర్మల్, లక్ష్మణచాంద, మామడ, కడెం మండలాలకు వరప్రదాయినిగా పిలుచుకునే సరస్వతీ కాలువ మరమ్మతులకు సైతం ఆయన ప్రతిపాదనలు రూపొందింపజేశారు. అధికారులు ఎమ్మెల్యే సూచనల మేరకు ఇటీవలే 14 రోడ్లకు సంబంధించి బీటీ నిర్మాణానికి రూ.40 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో దాదాపు 57 కిలోమీటర్ల పొడవుపై ఈ రోడ్లను నిర్మించనున్నారు. దాదాపు పదేళ్ల నుంచి ఈ రోడ్ల నిర్మాణానికి నోచుకోకపోవడంతో చాలా గ్రామాలకు లింకేజీ సౌకర్యం ఏర్పడడం లేదు. ప్రస్తుతం ఉన్న గతుకుల రోడ్ల కారణంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా వర్షాకాలంలో రవాణా సౌకర్యం స్థంభించిపోతోంది. అయితే ఎన్నికల సమయంలో ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి తమ రోడ్ల సమస్యను వివరించి ఆ సమస్యను పరిష్కరించాల్సిందిగా కోరారు. దీంతో ఆయన మొత్తం 14 గ్రామాలకు సంబంధించిన బీటీ రోడ్లపై దృష్టి సారించి వీటికి సంబంధించిన ప్రతిపాదనలు రూపొందింపజేశారు. అధికారులు రూపొందించిన ప్రతిపాదనల్నంటినీ మహేశ్వర్‌రెడ్డి సర్కారుకు ఇటీవలే అందించారు. తనకున్న సామర్థ్యంతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఎలాగైనా 14 బీటీ రోడ్ల నిర్మాణం కోసం రూ.40 కోట్లను మంజూరు చేయించేందుకు ఆయన ఇప్పటికే ఆయన వంతు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇదిలా ఉండగా.. జిల్లాకేంద్రంలోని ఎనిమిది గొలుసుకట్టు చెరువులతో పాటు సరస్వతీ కాలువ మరమ్మతులకు మొత్తం రూ.75 కోట్లను మంజూరు చేయించేందుకు కూడా తన వంతు ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇటీవలే ఇరిగేషన్ శాఖ అధికారులు రూపొందించిన ఈ ప్రతిపాదనను మహేశ్వర్‌రెడ్డి ప్రభుత్వానికి అందించడమే కాకుండా నిధుల మంజూరు కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు.

పల్లె రోడ్లకు పట్టం

నిర్మల్ జిల్లాలోని 14 ప్రధాన రోడ్లకు మహర్దశ పట్టబోనుంది. దీర్ఘకాలం నుంచి సమస్యగా మారిన ఈ రోడ్ల నిర్మాణంపై ఇప్పటి వరకు ఇటు పాలకులు.. అటు అధికారులు పెద్దగా పట్టించుకోలేదు. ఆయా గ్రామాల ప్రజలు తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని అనేకసార్లు ప్రజాప్రతినిధులను అధికారులను నిలదీసినప్పటికీ పెద్దగా ప్రయోజనం చేకూరలేదు. అయితే ప్రస్తుత ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఈ రోడ్ల నిర్మాణానికి సంబంధించి ఫోకస్ పెట్టడంతో సంబంధిత యంత్రాంగంలో కదలిక మొదలైంది. పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో పలుసార్లు సమీక్షలు జరిపి దాదాపు రూ.40 కోట్లతో ప్రతిపాదనలు రూపొందింపజేశారు. అయితే ఆయన ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి సైతం ఈ అంశాన్ని తీసుకువెళ్లారు. అలాగే ప్రభుత్వంపైనా ఒత్తిడి కూడా పెంచారు. దీని కారణంగా కొద్దిరోజుల్లో నిధులు మంజూరయ్యే అవకాశాలు కూడా ఉన్నాయంటున్నారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభించే దిశగా అధికార యంత్రాంగం కదలబోతోంది.

చెరువులకు పూర్వవైభవం

ఇదిలా ఉండగా.. జిల్లా కేంద్రం చుట్టూ ఉన్న గొలుసుకట్టు చెరువులకు కూడా పూర్వవైభవం రాబోనుంది. ఇప్పటికే చాలా గొలుసుకట్టు చెరువులు ఆక్ర మణలకు, కబ్జాలకు గురికావడంతో వాటి అస్థిత్వాలు కోల్పోతున్నాయి. గొలుసుకట్టు చెరువుల్లో అక్రమ నిర్మాణాల కారణంగా ఆ చెరువుల విస్తీర్ణం గణనీయం గా తగ్గిపోతోంది. దీంతో భూగర్భ జలాల శాతం కూడా క్రమక్రమంగా అడుగంటుతోంది. అయితే ఇప్పటికే గొలుసుకట్టు చెరువుల భూముల ఆక్రమణలపై ధ్వజమెత్తిన ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి వాటిని ఎలాగైనా పరిరక్షించేందుకు నడుం భిగించారు. ఇందులో భాగంగానే దాదాపు ఎనిమిది గొలుసుకట్టు చెరువుల మరమ్మతులకు ఇరిగేషన్ అధికారులతో ప్రతిపాదనలు రూపొందింపజేశారు. దాదాపు రూ.65 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి వాటిని ప్రభుత్వానికి అందించారు.

ప్రతిపాదనలు ఇవే..

నిర్మల్ పట్టణంలో ఆర్‌సీసీ డ్రైన్ కోసం రూ.121.71 లక్షలు, అలాగే బంగల్‌పేట్ చెరువు మరమ్మతులకు రూ.29.05 లక్షలు, జాపూర్ చెరువు మరమ్మతు లకు రూ.122.04 లక్షలు, ఖజానా చెరువు మరమ్మతులకు రూ.19.16 లక్షలు, కొత్తచెరువు ఇబ్రహీం నగర్ మరమ్మతులకు రూ.11.31 లక్షలు, రాంసాగర్ తలాబ్ మంజూలాపూర్ చెరువుకు మరమ్మతులకు రూ.163.68 లక్షలు, రాంసీతాసాగర్ చెరువు మరమ్మతులకు రూ. 88.15 లక్షలు, గొల్లపేట్ చెరువు మరమ్మతులకు రూ. 125.71 లక్షలతో ప్రతిపాదనలు రూపొందించారు.

సరస్వతీ మరమ్మతులకు మోక్షం

కాగా జిల్లాలో దాదాపు 38వేల ఎకరాలకు సాగునీరు అందించే సరస్వతీ కాలువ మరమ్మతులకు నోచుకోలేక చివరి ఆయకట్టు వరకు నీరు అందించలేకపోతోంది. అంతేకాకుండా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఈకాలువ ద్వారా సోన్, నిర్మల్, లక్ష్మణచాంద, మామడ, కడెం, ఖానాపూర్ మండలాలకు సాగునీరు అందిస్తున్నారు. అయితే లక్ష్యానికి అనుగుణంగా ఈ కాలువ ద్వారా పంట పొలాలకు సాగునీరు అందించడం లేదు. ముఖ్యంగా ప్రతియేటా వర్షకాలంలో ఈ కాలువ దెబ్బతిని అస్థిత్వాన్ని కోల్పోతోంది. కాలువలో పిచ్చి మొక్కలు, ఇసుక మేటలు పేరుకుపోవ డం, చాలాచోట్ల కట్ట బలహీనమై గండ్లు పడడం లాంటివి చోటు చేసుకుంటున్నాయి. అయితే ప్రస్తుతం ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చొరవతో ఈ సరస్వతీ కాలువ ఆధునికీకరణ పనులకు మోక్షం లభించబోతోంది. సంబంధిత అధికారులు సరస్వతీ కాలువ మరమతుల కోసం తాజాగా ప్రతిపాదనలు రూపొందించారు. ఈ ప్రతిపాదనలకు మోక్షం లభించగానే.. నిధులు మంజూరై పనులు ప్రారంభంకానున్నాయి.

పనులను స్థానిక ఏజెన్సీలకు అప్పగించాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు

నిర్మల్‌కల్చరల్, ఆగస్టు 23 : పొరుగు సేవల బాధ్యతలు జిల్లాలోని ఏజెన్సీలకే అప్పగించాలని కోరుతూ శుక్రవారం మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు భవాని కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న ఏజెన్సీలను కాదని ఇతర జిల్లాల ఏజెన్సీలకు బాధ్యతలు అప్పగించడం సరికాదని తెలిపారు. ప్రభుత్వం బ్లాక్‌లిస్టులో పెట్టిన ఏజెన్సీలకు ఇస్తే నిరుద్యోగులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో నియమించే పొరుగుసేవల సిబ్బందిని పూర్తిమెరిట్, రోస్టర్ పాయింట్ల ప్రాతిపదికన జరగాలన్నారు. కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బి.గోవింద్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు లక్ష్మీ, జలజ, రమ, శారద, పరిమళ పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 23 : గాజులపేట్ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి 11 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని ట్రాన్స్‌కో అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. గాజులపేట్, కొమ్మునారాయణ రైస్‌మిల్, ఎమ్మెల్యే నివాస ప్రాంతం, బైల్‌బజార్, డాక్టర్స్ లేన్, ప్రాంతాల్లో ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ వైద్యుల నిరసన



నిరసన ప్రదర్శనలో పాల్గొన్న వైద్యులు

నిర్మల్ కల్చరల్, ఆగస్టు 23 : గత కొద్దిరోజుల క్రితం కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై అత్యాచారం జరిగిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రి వెలుపల వైద్యులు, సిబ్బంది శుక్రవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. దేశవ్యాప్తంగా డాక్టర్ల నిరసనలో భాగంగా వైద్యులు మాట్లాడుతూ... యావత్ భారతదేశంలోని మహిళలకు ఈ సంఘటనతో రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆసుపత్రులలో పనిచేసే వైద్యులకు ప్రభుత్వం రక్షణ కల్పిస్తూ నేరస్తులను శిక్షించేందుకు కఠిన చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూపరిండెంట్ సునీల్ రాథోడ్, డాక్టర్స్ ప్రొఫెసర్స్ శ్రీకర్, దయాకర్, అరుణ్‌కుమార్ రెడ్డి, అమీనా, గాయత్రి, జయప్రకాష్, క్రిష్, సాయిచరణ్, యశ్వంత్ పాల్గొన్నారు.

వ్యవసాయ సహాయ సంచాలకులుగా భాస్కర్


సన్మానిస్తున్న వ్యవసాయ అధికారులు

నిర్మల్‌కల్చరల్, ఆగస్టు 21 : నిర్మల్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకుడిగా భాస్కర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు పని చేసిన వినయ్ బాబు ముథోల్ ఏడీఏగా బదిలీపై వెళ్లారు. భాస్కర్‌ను ఏవో నాగరాజు, ఏఈవో కే. రవి కుమార్ ఆయనను సత్కరించి అభినందించారు.

ఆర్‌వోఆర్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

● కలెక్టర్ అభిలాష అభినవ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నిర్మల్‌అర్బన్, ఆగస్టు 23 : ఆర్‌వోఆర్ చట్టంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నూతన ఆర్‌వోఆర్ చట్టంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో భాగంగా రెవెన్యూ అధికారులు, రిటైర్డ్ అధికారులు, న్యాయనిపుణులతో ఆర్‌వోఆర్ బిల్లుపై విస్తృతంగా చర్చించారు. ఆర్‌వోఆర్ బిల్లుపై అధికారులు, న్యాయనిపుణుల నుంచి సూచనలు, సలహాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొత్త ఆర్‌వోఆర్ చట్టం కాపీని ఇదివరకే సీసీ ఎల్‌ఏ వెబ్‌సైట్‌లో పబ్లిక్ డొమైన్‌లో ఉంచారని, తద్వారా ప్రజల నుంచి కూడా సలహాలు, సూచనలు స్వీకరించడానికి అవకాశం కల్పించారన్నారు. ఆర్‌వోఆర్ బిల్లుపై ప్రజలకు ఉన్న సందేహాలను అధికారులు నివృత్తి చేయాలని ఆదేశించారు. బిల్లులో గల అంశాలను ప్రజలకు వివరిస్తూ అవగాహన కల్పించాలన్నారు. క్షేత్రస్థాయిలో కూడా ప్రజల నుంచి ఆర్‌వోఆర్ బిల్లుపై సలహాలు, సూచనలను స్వీకరించాలని తెలిపారు. అధికారులు తమ రోజు వారి విధుల్లో భాగంగా ఇంతకు ముందున్న 2020 చట్టంలో ప్రజల నుంచి ఎన్నో ఫిర్యాదులను స్వీకరించారని, ఈ క్రమంలో ఎదురైన అనుభవాల ద్వారా కొత్త ఆర్‌వోఆర్ బిల్లులో గల అంశాలను అవగాహన పరుచుకోవాలని తెలిపారు. ఆర్‌వోఆర్ చట్టపు బిల్లుకు సంబంధించి వివరణలు, నిర్వచనాలు ఇతర అంశాలను అధి కారులతో చర్చించారు. ప్రతిఒక అధికారి ఆర్‌వోఆర్ పోర్టల్ గురించి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఆర్‌వో భుజంగ్ రావు, నిర్మల్, ముథోల్ ఆర్డీవోలు రత్నకళ్యాణి, కోమల్‌రెడ్డిలు, రెవెన్యూ అధికారులు, న్యాయనిపుణులు, ఇతర రిటైర్డ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే రుణమాఫీ చేయాలి

● పెంచికల్‌పాడ్ గ్రామరైతుల వినతి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెంచికల్‌పాడ్ రైతులు

కుంటాల, ఆగస్టు, 23 : రైతులందరికీ తక్షణమే రుణాలన్నీ మాఫీ చేయాలని కోరుతూ మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామరైతులు శుక్రవారం తహసీల్దార్, వ్యవసాయ శాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు రుణాలన్నింటినీ మాఫీ చేస్తామని చెప్పి ప్రస్తుతం కాలయాపన చేస్తుందని, రైతులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారని వెంటనే రుణమాఫీ వెంటనే చేపట్టాలని వినతి పత్రంలో పేర్కొన్నట్లు రైతులు తెలిపారు.

కేజీబీవీలో నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీ

కుభీర్, ఆగస్టు 23 : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో నాన్‌టీచింగ్ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు ఎంఈవో చంద్రకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓసి జనరల్ అటెండర్, ఓసి మహిళ లే వచ్ ఉమెన్, బీసీబీ జనరల్ నైట్ వాచ్ ఉమెన్, ఓసి జనరల్ స్టేవెంజర్, పోస్టులు భర్తీ చేస్తున్నామని తెలిపారు. పదోతరగతి ఉత్తీర్ణులై 18సంవత్సరాలు పైబడిన వారు ఆదాయ, కుల, నివాస, పదోతరగతి సర్టిఫికేట్‌తో మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో ఈ నెల 22 నుండి 31లోగ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 9542513005 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

నిర్మల్‌కల్చరల్, ఆగస్టు 23 : అఖిల భారత అయ్యప్ప సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు పీఆర్‌వో మండాజి మారుతి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక దీక్ష జూనియర్ కాలేజీలో అయ్యప్ప సేవా సమితి, ప్రసన్న హరికృష్ణ విన్నర్స్ సహకారంతో నిర్వహించే మెగా మేళాలో సుమారు 1500 ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు.

పోలీసులు క్రీడాస్ఫూర్తిని అలవర్చుకోవాలి

● ఎస్పీ జానకిషర్మిల ● పోలీసులకు క్రికెట్ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్పీ

నిర్మల్‌కల్చరల్, ఆగస్టు 23 : క్రీడల్లో గెలుపు ఓటములు స్ఫూర్తిగా తీసుకొని నిజజీవితంలో అలవర్చుకోవాలని జిల్లా ఎస్పీ జానకిషర్మిల ఉద్బోధించారు. శుక్రవారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి నిర్మల్ టైగర్స్‌ట్రోఫీ 2024 క్రికెట్ పోటీలు ప్రారంభించారు. అనుక్షణం శాంతి భద్రతల పరిరక్షణలో నిమగ్నమయ్యే పోలీసు సిబ్బంది మానసిక ఉల్లాసం పొందాలంటే క్రీడలు ఎంతో అవసరమన్నారు. శారీరకంగా దృఢత్వం కలిగి విధులు మరింత మెరుగ్గా నిర్వహించాలంటే క్రీడలతో సాధ్యమవుతుం దన్నారు. పోటీతత్వం నెలకొని క్రీడాస్ఫూర్తి విధి నిర్వహణలో పోలీసులు ప్రదర్శించే వీలుంటుం దన్నారు. మొదటిమ్యాచ్ బంతి విసిరి క్రీడాకారులను ఎస్పీ ఉత్తేజపరిచారు. మొత్తం పది టీములు ఏర్పాటుచేసి టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. తొలి రోజు నిర్మల్‌టౌన్, భైంసాటౌన్ టీమ్‌లు తలపడ్డాయి. కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, డీఎస్పీ గంగారెడ్డి, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

చదువుల్లో రాణించాలి : డీఈవో

తానూర్, ఆగస్టు 23 : మండలంలోని భోసి ఉన్నత పాఠశాలలో, మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలను శుక్రవారం జిల్లా విద్యాధికారి రవీందర్‌రెడ్డి సందర్శించారు. కార్యక్రమంలో భాగంగా తానూర్ కస్తూర్బాగాంధీ పాఠశాలలో పదోతరగతి విద్యార్థులతో మమేకమై క్లాస్‌రూంలో విద్యార్థులందరూ ఇష్టపడి చదివి పదోతరగతి పరీక్షల్లో మంచి మార్కులు పొందాలన్నారు. విద్యాభ్యాసంలో భాగంగా ఏమైనా సందేహాలుంటే తమ ఉపాధ్యాయులకు అడిగి తెలుసుకోవాలన్నారు. పాఠ్యాంశాలను విద్యార్థులు చర్చించుకోవాలన్నారు. కస్తూర్బా పాఠశాలలో వంటగదిని పరిశీలించారు. విద్యార్థులకు విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈయన వెంట ఎంఈవో సుభాష్, ప్రధానోపాధ్యాయులు అలేఖ్య, ఉపాధ్యాయులున్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

● అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్

నిర్మల్‌టౌన్, ఆగస్టు 23 : ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ (రెవెన్యూ) అధికారులను ఆదేశించారు. శుక్రవార స్థానిక సోఫీనగర్‌లోని సోన్, నిర్మల్ కేజీబీవీలను తనిఖీ చేశారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజనానికి సరఫరా చేస్తున్న సన్న బియ్యం, ఇతర వంట సామగ్రిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులకు మెనూప్రకారం నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఆదేశించారు. వంట గది, స్టోర్ రూమ్‌ను పరిశీలించి బియ్యం నాణ్యతను తనిఖీ చేశారు. వంటకు నాణ్యమైన వస్తువులను మాత్రమే వాడాలని, సన్న బియ్యం, వంట సా మాగ్రికి సంబంధించి రిజిస్టర్లు, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యా హ్న భోజనం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశీలించి, నిరంతరం పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


వంట గది స్టోర్‌రూమును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్